

వ్యవసాయమే మూలాధారం

వ్యవసాయమే అన్నిరంగాలకు మూలాధారమని కేవీకే కంపాసాగర్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. - 8లో



వెల్లంకిలో 'బలగం' సందడి

బలగం చిత్ర నటీనటులు రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో మంగళవారం సందడి చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37° / 26°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు వర్ష సూచన

త్రిపురారం : నల్లగొండ, యాదాద్రి జిల్లాలో బుధవారం నుంచి జూన్ 2వ తేదీ వరకు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లోని రైతులు దీర్ఘ కాలిక వరి రకాల నారుమళ్లు పోసుకోవడానికి ఇది అనుకూలమైన సమయమని పేర్కొన్నారు. వరి సాగు చేసే పొలాల్లో తొలకరి వర్షాలను ఉపయోగించుకొని జనుము, జీలుగ పచ్చిరొట్ట పైర్లు ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాల్లో పెసరను పచ్చిరొట్ట ఎరువుగా పెంచి భూమిలో కలియదున్నుకోవాలని సూచించారు.

బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్



నియామక పత్రం అందజేస్తున్న రాజు

నల్లగొండ టౌన్ : తెలంగాణ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముత్యాల శివశంకర్ యాదవ్‌ను నియమిస్తూ ఆ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజుయాదవ్ మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్, బీసీల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. తన నియమకానికి సహకరించిన మేకపోతుల రవీందర్‌గౌడ్, బీసీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న నారి ఐలయ్య

మిర్యాలగూడ : పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుతండా, అజ్మీరతండాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు చట్ట ప్రకారం రూ.272 అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి జూన్ 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొజ్జ చిన్న వెంకులు, పిల్లుట్ల సైదులు, రవినాయక్, రాములు, బాలసైదులు, పాక గోపి, హనుమంతు, వినోద్‌నాయక్, దయానంద్, అరుణ, విజయ, లక్ష్మి, సైదులు, రమేష్, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలని ధర్నా



డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో రాంనగర్ బంధం వద్ద కాలనీల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణంలోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి రీసైక్లింగ్ చేసి కంపోస్టు ఎరువుగా మార్చే విధంగా గతంలో ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారని.. కానీ కంపోస్టు ఎరువు తయారు చేయకుండా చెత్తను కాల్చి వేయడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించారని అక్కడికి తరలించడంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ రాధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, జగదీష్‌చంద్ర, గౌతంరెడ్డి, మంగారెడ్డి, పరశురాములు, శశిధర్‌రెడ్డి, అంజద్, పాపారావు, ఫాతిమాబేగం, గోవర్ధిని, బాబునాయక్, రమేష్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'దశాబ్ది' వేడుక

- 20 రోజులపాటు రాష్ట్ర అవతరణ ఉత్సవాలు
- నిర్వహణకు అన్నీ సిద్ధం చేస్తున్న జిల్లా యంత్రాంగం
- ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని తెలియజేసేలా కార్యక్రమాలు



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్, రాజ్యసభ సభ్యుడు, కలెక్టర్లు తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 9 ఏళ్ల పూర్తయి పదో సంవత్సరంలో అడుగుతున్న తరుణంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాలపై విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం యాదాద్రి కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా యాదాద్రితోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోనూ నిర్వహించబోయే కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.

ప్రగతిని వివరించేలా..

రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొమ్మిదేళ్ల కాలంలో జిల్లాలో సాధించిన విజయాలు, ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికి తెలియజెప్పేలా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వాములు చేస్తూ గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలవుతున్న నేపథ్యంలో వాటన్నింటినీ ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల ద్వారా రోజువారీగా చేపట్టాలని నిర్ణయించారు.

దశాబ్ది ఉత్సవాల రోజువారీ కార్యక్రమాలు ఇవే..

- జూన్ 2వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అదే రోజున గ్రామ పంచాయతీ నుంచి మొదలుకొని మండలం, మున్సిపాలిటీ, డివిజన్, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో పతాకావిష్కరణ, ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం ఉంటుంది.
- 3వ తేదీన జిల్లాలోని రైతు వేదికల స్థాయిలో రైతు దినోత్సవ కార్యక్రమం చేపడతారు. దేశానికే అన్నంపెట్టే స్థాయిలో రాష్ట్రం ఎదిగిన తీరును తెలియజెప్పడంతోపాటు వ్యవసాయ రంగంపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 4వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో సురక్ష దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరైన విషయాలతోపాటు రక్షణకు సంబంధించిన విషయాలపై చర్చిస్తారు.
- 5న విద్యుత్ విజయోత్సవం కార్యక్రమాలను నియోజకవర్గ, సబ్‌స్టేషన్ స్థాయిలో నిర్వహిస్తారు. రైతాంగానికి ఉచిత విద్యుత్, విద్యుత్‌శాఖ సాధించిన ప్రగతి, తద్వారా ప్రజలకు అందుతున్న విద్యుత్ సేవలపై కార్యక్రమాలు ఉంటాయి.
- 6వ తేదీన పారిశ్రామిక ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహిస్తారు.
- 7వ తేదీన సాగునీటి దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 9 ఏళ్ల కాలంలో సాగునీటిపై సాధించిన ప్రగతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 8వ తేదీన ఊరూరా చెరువుల పండుగను నిర్వహిస్తారు.
- 9వ తేదీన సంక్షేమ సంబురాలు నియోజకవర్గ స్థాయిలో ఉంటాయి.
- 10వ తేదీన సుపరిపాలన దినోత్సవాన్ని కొత్తగా ఏర్పడిన జిల్లా, డివిజన్, మున్సిపాలిటీ, మండల, గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తారు.
- 11న జిల్లా స్థాయిలో సాహిత్య దినోత్సవం ఉంటుంది. కవులను సన్మానిస్తారు.
- 12న నియోజకవర్గ స్థాయిలో తెలంగాణ రన్ నిర్వహిస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.
- 13న నియోజకవర్గ స్థాయిలో మహిళ సంక్షేమ దినోత్సవం.
- 14న నియోజకవర్గ స్థాయిలో, అన్ని ఆసుపత్రుల్లో వైద్య ఆరోగ్య దినోత్సవం
- 15న గ్రామ పంచాయతీ స్థాయిలో పల్లె ప్రగతి దినోత్సవం
- 16న మున్సిపాలిటీ స్థాయిలో పట్టణ ప్రగతి దినోత్సవం
- 17న అన్ని గిరిజన గ్రామ పంచాయతీల్లో గిరిజనోత్సవం
- 18న గ్రామాల నుంచి జిల్లా వరకు మిషన్ భగీరథ (మంచినీళ్ల) పండుగ.
- 19న అన్ని స్థాయిల్లో హరితోత్సవం
- 20న అన్ని విద్యా సంస్థల్లో విద్యా దినోత్సవం
- 21న అన్ని స్థాయిల్లో అధ్యాత్మిక దినోత్సవం
- చివరిరోజైన జూన్ 22న గ్రామాల నుంచి మొదలుకొని జిల్లా వరకు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

జిల్లాకు 2,150 న్యూట్రిషన్ కిట్లు

- జీజీహెచ్, ఏరియా ఆస్పత్రుల్లో నిల్వ
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా గర్భిణులకు అందజేత



నల్లగొండ టౌన్ : గర్భిణుల్లో రక్తహీనత (ఎనీమియా)ను నివారించడానికి ప్రభుత్వం వారికి న్యూట్రిషన్ కిట్లను అందజేస్తోంది. ప్రపంచ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో భాగంగా జిల్లాకు తొలుత 2,150 కిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. వాటిని నల్లగొండలోని గవర్నమెంట్ జనరల్ హస్పిటల్ (జీజీహెచ్)తో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఏరియా ఆస్పత్రులు, నకిరేకల్, మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో భద్రపరిచారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఒకేరోజున గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లను అందజేసే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించిన 14వ తేదీన గర్భిణులకు కిట్‌లను అందజేయాలని నిర్ణయించింది. ఆయా నియోజకవర్గ ఆస్పత్రుల్లో శాసనసభ్యుల చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేయించనున్నారు.

న్యూట్రిషన్ కిట్‌లో ఉండే వస్తువులు ఇవే..
కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్
కిలో ఖర్జూర ప్యాకెట్
మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు
500 గ్రాముల నెయ్యి
ఒక కప్పు
200 గ్రాముల పల్లిపట్టీ
ఒక బాస్కెట్

రెండు విడతలుగా..

న్యూట్రిషన్ కిట్‌లను రెండు విడుతలుగా అందజేయనున్నారు. కేసీఆర్ కిట్ పథకంలో పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ కిట్‌లను ఇవ్వనున్నారు. ఎన్ని కాన్పులకైనా న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తారు. మొదటి కిట్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేసుకున్న 12–26 వారాలలోపు, రెండో కిట్‌ను 27–34 వారాలలోపు జీజీహెచ్‌తోపాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఏరియా ఆస్పత్రి, నకిరేకల్, మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పరీక్షల కోసం వచ్చినప్పుడు అందజేస్తారు. ప్రారంభం రోజున ఆయా ఆస్పత్రుల్లో 27–34 వారాలలోపు పరీక్షల చేయించుకోడానికి వచ్చే గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేసే అవకాశం ఉంది.

మాతాశిశు మరణాలు తగ్గేలా..

మాతా శిశు మరణాలను తగ్గించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లను అందించాలని నిర్ణయించింది. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు చాలా మంది ప్రసవ సమయంలో చనిపోతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ న్యూట్రిషన్ కిట్‌ల వల్ల మంచి పౌష్టిహారం అందించడం ద్వారా గర్భిణుల్లో ఉన్న రక్తహీనతను నివారించవచ్చు.

రక్తహీనతను నివారించడమే లక్ష్యం



గర్భిణుల్లో రక్తహీనత(ఎనీమియా)ను నివారించడమే లక్ష్యంగా న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కిట్‌లు గర్భిణులకు వరం లాంటిది. ప్రతి గర్భిణికి ఉచితంగా అందజేయనున్నందున సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

అకాల వర్షంతో ఆగిన స్పిల్‌వే పనులు



స్పిల్‌వే వద్ద నిలిచిపోయిన పనులు

నాగార్జునసాగర్ : అకాల వర్షంతో సాగర్ ప్రాజెక్ట్ స్పిల్‌వే పనులు సోమవారం సాయంత్రం నుంచి నిలిచిపోయాయి. గతం వారం మొత్తం ఎండలు మండిపోగా పనులు సాయంత్రం వేళలో చేశారు. ప్రాజెక్ట్‌కు 26 రేడియల్ క్రస్ట్ గేట్లకు దిగువన స్పిల్‌వే మీద 25 చోట్ల గుంతలు పడ్డాయి. సకాలంలో మరమ్మతు పనులు చేయకపోవడంతో గుంతలు లోతుగా మారాయి. దిగువన బకెట్ పోర్షన్ కూడా దెబ్బతిని కొంత మేరకు యాప్రాన్ కూడా కొట్టుకుపోయింది. మరమ్మతు పనులకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్ అయ్యి పనులు ప్రారంభమయ్యే సరికే కొంత ఆలస్యమైనది. రెండు నెలలుగా ప్రతికూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల ఆమేరకు స్థానిక ఇంజనీర్లు దగ్గరుండి రేయింబవళ్లు పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 12వ గేటు దిగువన స్పిల్‌వే మీద పడిన గుంత మరమ్మతులు చేసే పనులు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పనులు ఆగిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. స్పిల్‌వే మీద పడిన వర్షం నీరంతా బకెట్ పోర్షన్‌లోకి చేరింది. ఆ నీటినంతటినీ ట్రాక్టర్ పంపు సహాయంతో నదిలోకి డివాటరింగ్ చేస్తున్నారు. కాంక్రీట్ పనులు చేయడానికి వీలు లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. స్పిల్‌వే పైభాగంలో చిప్పింగ్ చేయడానికి కూలీలు వచ్చినప్పటికీ వర్షం కారణంగా ఆ పనులు కూడా చేయలేకపోయారు.

కమనీయం.. రేణుకా ఎల్లమ్మ కల్యాణం

- జనసంద్రంగా మారిన దర్వేశిపురం
- అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



కల్యాణంలో భాగంగా తాళిని చూపిస్తున్న అర్చకుడు

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షిల 21వ వార్షిక కల్యాణం మంగళవారం కనులపండువగా సాగింది. అమ్మవారు, జమదగ్ని మహామునీల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కల్యాణ మండపానికి కోలాట బృందాలు, డప్పుచప్పుళ్ల నడుమ తరలించారు. డేరం భాస్కరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు నాగోలు మల్లాచారి, చిలకమర్రి శ్రావణకుమారాచార్యుల అర్చకత్వంలో వేద పండితులు బృందం కల్యాణ తంతును వైభవంగా నిర్వహించింది. అమ్మవారికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి.. ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్యతో కలిసి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం సుప్రభాతసేవ, లలితాసహస్ర నామర్చాన, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో దర్వేశిపురం గ్రామ పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. డీఎస్పీ నర్సింహారెడ్డి నేతృత్వంలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ నగేష్ బందోబస్తు నిర్వహించారు.

వర్షంతో ఆలస్యం..

మంగళవారం ఉదయం 8 గంటల నుంచి దర్వేశిపురంలో మోస్తరు వర్షం కురవడంతో కల్యాణ మహోత్సవం కాస్త ఆలస్యమైంది. కల్యాణ మండపాన్ని మార్చి ఆలయం వెనుక ఉన్న రేకుల షెడ్డులో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి సర్పంచ్‌లు అల్లుబెల్లి పూలమ్మ, చనగాని అంజమ్మ, ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, అర్చకులు దామోదర్, మహేష్, ఫణి, శ్రీను, నాగరాజు సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.



రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కల్యాణానికి హాజరైన భక్తులు

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆశ వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్లకు పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చినపాక లక్ష్మీనారాయణ, మహేశ్వరి, వెంకటమ్మ, వసంత, కవిత, సుజాత, పార్వతమ్మ, మమత, జయమ్మ, నాగమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

హైవే వెంట హోటళ్లలో తనిఖీలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

చౌటుప్పల్ : పట్టణ, మండల పరిధిలో జాతీయ రహదారి వెంట ఉన్న పలు హోటళ్లలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కిచెన్‌లు, సామగ్రి నిల్వ గదులతో పాటు ఆహార పదార్థాలను పరిశీలించారు. శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ డిసిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు ఆకుపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యం ఆరగింపుగా పెట్టారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు. వివిధ పూజల ద్వారా రూ.31,86,931 ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

1,341 చెరువులు.. 6.15 కోట్ల చేపపిల్లలు

- ప్రభుత్వానికి మత్స్య శాఖ ప్రతిపాదనలు
- మత్స్యకారులకు ఉచితంగా పంపిణీకి సన్నాహాలు
- వానాకాలం సీజన్‌లో చెరువుల్లో వదిలేందుకు కార్యాచరణ
- ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించిన సర్కార్



నల్లగొండ టూటౌన్ : మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న కేసీఆర్ ప్రభుత్వం ఏటా వారికి ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి ఏడాది జిల్లాలో ఉన్న చెరువులు, కుంటల విస్తీర్ణాన్ని బట్టి వాటిల్లో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఉచితంగా చేపపిల్లలు పోస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 1,341 చెరువులు, కుంటలకు, మరో 9 రిజర్వాయర్లకు కలిపి మొత్తం 6.15 కోట్ల చేపపిల్లలు అవసరం అవుతాయని జిల్లా మత్స్య శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనల ప్రకారం ప్రభుత్వం చేపపిల్లల సరఫరా కోసం టెండర్లు పిలిచింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపార్ట్‌మెంట్ చెరువులు, జీపీ చెరువులు, కుంటలకు సరిపడా చేపపిల్లలను ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సరఫరా చేయనుంది. ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లల పెంపకంతో మత్స్యకారులకు ఏడాది అంతా ఉపాధి లభిస్తోంది.

30 వేల మంది మత్స్యకారులకు లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ లెక్కల ప్రకారం 220 వరకు మత్స్య సొసైటీలు ఉన్నాయి. సొసైటీలతో పాటు గ్రామ పంచాయతీలకు చెందిన మత్స్యకారులకు ఉచిత చేపపిల్లలతో లబ్ధి చేకూరుతుంది. దీని ద్వారా జిల్లాలోని అన్ని, మండలాలు, గ్రామాల్లో కలిపి దాదాపు 30 వేలకు పైగానే మత్స్యకారులు ఉపాధి పొందుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాకు అవసరమైన ఉచిత చేపపిల్లల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం కూడా ఉచిత చేపపిల్లలకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది. వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండే సమయానికి అన్ని సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి, నల్లగొండ

చెరువుల విస్తీర్ణం బట్టి చేపపిల్లలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల విస్తీర్ణంతోపాటు వాటికి ఉన్న నీటి వసతిని బట్టి చేపపిల్లలను సరఫరా చేయనున్నారు. ఆయా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను బట్టి 35 నుంచి 40 ఎంఎం సైజు, 40 నుంచి 80 ఎంఎం సైజు ఉండే చేపపిల్లలను అందిస్తారు. వంద ఎకరాల లోపు ఉండే చెరువులు, కుంటలకు 35 నుంచి 40 ఎంఎం ఉండే చేపపిల్లలు, 100 ఎకరాలకుపై బడి ఉండే రిజర్వాయర్లు, చెరువులకు 40 నుంచి 80 ఎంఎం సైజు గల చేపపిల్లలను అందించనున్నారు. వాటి సామర్థ్యం బట్టి చేపపిల్లల సైజ్‌ను మత్స్యశాఖ అధికారులు నిర్ధారించి ఆయా చెరువులకు సరఫరా చేస్తారు. జిల్లాలో ఉన్న చెరువులు, రిజర్వాయర్లు, కుంటలకు ఎక్కువగా సెప్టెంబర్ నుంచి మొదలు పెట్టి, వర్షాలను బట్టి అక్టోబర్, నవంబర్ నెలల్లో చేపపిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఒకవేళ వర్షాలు ముందస్తుగా పడి చెరువులు, కుంటలు నిండితే దానికి అనుగుణంగా ముందుగానే ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

వైన్స్ వద్ద కిందపడి వ్యక్తి మృతి

కోదాడరూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి వైన్స్ ఎదుట కిందపడి మృతిచెందిన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన కొమ్ముబట్ల వెంకటకృష్ణ(45) అవివాహితుడు. పూర్తిగా మద్యానికి బానిసైన అతడు మంగళవారం పట్టణంలోని ఓ వైన్స్ వద్దకు వెళ్లి మద్యం తాగి పక్కనే కిందపడ్డాడు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గమనించి కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగేంద్రప్రసాద్ (ఫైల్)

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం .. చిలుకూరు మండలంలోని దూదియాతండా గ్రామానికి చెందిన భూక్యా నాగేంద్రప్రసాద్ (35)ఆదివారం పని నిమిత్తం బైక్‌పై చిలుకూరుకు వచ్చి గ్రామానికి తిరిగి వెళ్తుండగా మార్గ మధ్యలో అదుపుతప్పి బైక్ పైనుంచి కింద పడడంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లగా చిక్సిత పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

భువనగిరి: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌లో కొందరు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి సంజీవనగర్‌కు చెందిన మంచాల సంతోష్, శ్రీరాంనగర్‌కు చెందిన చాట్ల సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరు సోమవారం గుజరాత్–చెన్నై మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా డఫాబెట్ అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి రూ.4300 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కల్లూరు: ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కోదాడ మండలం బండపాలెం తమ్మరకు చెందిన ముగ్గురు యువకులు ఓ శుభకార్యం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో బంధువుల ఇంటికి సోమవారం వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వస్తుండగా కల్లూరు మండలం పేరువంచ సమీపాన తిరువూరు వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో షేక్ అజిత్, షేక్ సమీర్, షేక్ హమీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వచ్చిన వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.

పండుగలా దశాబ్ది ఉత్సవాలు

- తొమ్మిదేళ్ల ప్రగతి ప్రతిబింబించాలి
- సన్నాహక సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి


తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా అధికారులు

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంగళవారం యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరుల ఆశయాలకు అనుగుణంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు విశ్వాసం కలిగించామని, టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పి లక్షలాది మందికి ఉపాధి కల్పించామన్నారు. తలసరి ఆదాయంలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. జూన్ 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలు, ప్రగతిని ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరినీ భాగస్వాములను భాగస్వాములను చేయాలని కోరారు.

2లోగా నివేదికలు సమర్పించాలి

తొమ్మిదేళ్లలో జిల్లా సాధించిన ప్రగతిపై శాఖల వారీగా నివేదికలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. నివేదికలను 2వ తేదీ లోపు ప్రజాప్రతినిధులందరికీ సమర్పించాలని కోరారు. తెలంగాణ రైతు దినోత్సవం మొదలుకొని జూన్ 22వ తేదీ వరకు గ్రామ, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో రోజుకో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కవులు, గిరిజనులను సత్కరించాలని సూచించారు. తొమ్మిదేళ్ల పరిస్థితిపై ప్రతి శాఖ ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారినే అవార్డులకు ఎంపిక చేయాలని స్పష్టం చేశారు.


సమావేశంలో పాల్గొన్న ఎస్పీలు రాజేంద్రప్రసాద్, అపూర్వరావు, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర

అందరూ సహకరించాలి

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు చేపడుతున్న చర్యలను ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, టి.వినయ్‌కృష్ణారెడ్డి, వెంకట్‌రావు, ఎస్పీలు అపూర్వరావు, రాజేంద్రప్రసాద్, డీసీపీ రాజేశ్‌చంద్ర వివరించారు. 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాలు, చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, డీసీసీబీ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్‌లు

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకొని 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 2 నుంచి 22 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలు, సకలజనులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగం ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 80వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయన్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, కానీ వారికి పరాభావం తప్పదన్నారు. రాష్ట్రంలో ఎనభై శాతం మంది కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు.

6 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు..

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే తెలంగాణ మాత్రమేనని, ఇప్పటి వరకు 6లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మిల్లుల వద్ద స్థలం లేకపోవడం, లారీల నుంచి ధాన్యం దిగుమతి కాక కొంత ఆలస్యం జరుగుతందని పేర్కొన్నారు. వారం, పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో సైతం అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యాదాద్రి హుండీల ఆదాయం రూ.2.28కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయ హుండీలను మంగళవారం కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో భాగంగా రూ.2,28,25,714 నగదు, 95 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 700 గ్రాములు మిశ్రమ వెండి వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. వీటితో పాటు 657 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్ డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు, 15 కెనడా డాలర్లు, 40 యూఏఈ దీర్హామ్స్, 57 మలేషియా రింగిట్స్, 400 ఒమాన్ రియాల్స్, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 20 యూరోలు, 20 ఖతార్ రియాల్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆదాయం 19 రోజులదని ఈఓ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మునుగోడు: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొరటికల్ గ్రామానికి చెందిన టమాటల మల్లయ్య (62) మంగళవారం తన ఇంట్లోని మంచినీటి బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటారుకు విద్యుత్ సరఫరా అయ్యే స్విచ్ ఆఫ్ చేయకుండా వైర్లని కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతిచెందాడు. రేషన్ బియ్యం కోసం వెళ్లిన భార్య తిరిగి ఇంటికి వచ్చే సమయానికి మల్లయ్య విగతజీవిగా పడి ఉండటంతో ఆమె బోరున విలపించింది. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డికి పితృ వియోగం

నాగారం, భువనగిరి: భువనగిరి ఏసీపీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి సైరెడ్డి చెన్నకృష్ణారెడ్డి (95) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. భువనగిరిలో కుమారుడితో కలిసి ఉంటున్న చెన్నకృష్ణారెడ్డి ఆరోగ్యం ఆకస్మాత్తుగా క్షీణించడంతో వెంటనే యాదాద్రి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించే లోపు ఆయన మృతిచెందారు. చెన్నకృష్ణారెడ్డి స్వగ్రామం సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామం. ఆయనకు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో చెన్నకృష్ణారెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నకృష్ణారెడ్డి మృతిపట్ల భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర సంతాపం తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

నకిరేకల్: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పన్నాలగూడెంలో నివాసముంటున్న కాకుల శ్రీరాములు(40) రోజుమాదిరిగా సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కేందుకు సమీపంలోని తాటిచెట్ల వద్దకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కే క్రమంలో పైనుంచి జారి కింద పడిపోయాడు. రాత్రి అయినా శ్రీరాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం తాటిచెట్ల వద్దకు వెళ్లగా అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

తెలంగాణ ప్రగతిని చూసి ప్రపంచమే నివ్వెరపోతోంది

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: తెలంగాణ రాష్ట్ర ప్రగతిని చూసి ప్రపంచమే నివ్వెరపోతోందని, ప్రపంచ వ్యవసాయ రంగ నిపుణులు, రైతు ఉద్యమకారులకు ఆశ్చర్యం కలిగించే విధంగా తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వ్యవసాయ రంగంలో ఎక్కువగా లాభపడిన జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా అన్నారు. ఉమ్మడి జిల్లా గత 4 సంవత్సరాలుగా 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఎదిగిందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ ప్రణాళికలు మార్చుకోవాలని అన్నారు. రైతాంగానికి ఇప్పటికే 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రాజెక్టుల్లో, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉందన్నారు. రాష్ట్ర సాధన సమయంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేశారని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జడల అమరేందర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య ఉన్నారు.

వ్యవసాయమే అన్నిరంగాలకు మూలాధారం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేవీకే కంపాసాగర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హాలియా: వ్యవసాయమే అన్నిరంగాల మనుగడకు మూలాధారమని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హాలియా మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో వివిధ పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయరంగం దయనీయ స్థితిలో ఉందన్నారు. ఇష్టానుసారంగా పురుగుల మందుల వాడకం వలన నేల దాని సారం కోల్పోతుందని, దీంతో ప్రకృతి విపత్తులు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అందుకు తగ్గట్టుగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించి సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శివప్రసాద్ వరి, పత్తి విత్తనాల కొనుగోళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమ్మ, బత్తాయి తోటల సాగులో మెలకువలు, నేలల సంరక్షణ, పురుగులు, తెగుళ్లు, చీడపీడల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి, తిమ్మాపురం ఉప సర్పంచ్ తుమ్మరగోటి రమేష్, రైతులు, రైతు సంఘం నాయకులు, ఏకే ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వెల్లంకిలో 'బలగం' నటీనటుల సందడి


బలగం సినిమా నటీనటులను సన్మానిస్తున్న వెల్లంకి గ్రామస్తులు

రామన్నపేట: బలగం చిత్ర నటీనటులు మంగళవారం సాయంత్రం రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో సందడి చేశారు. గ్రామానికి చెందిన కందాల సురేష్ నూతనంగా నిర్మించనున్న చిత్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఎల్లమ్మ పండుగ నిర్వహించారు. దీంతో బలగం సినిమా నటీనటులను ఆహ్వానించి తన తల్లితండ్రులు కేశవులు–యాదమ్మ చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో నటీనటులు నకిరేకంటి రమేష్(నిధానపల్లి), కొమరయ్య పాత్రధారి సుధాకర్‌రెడ్డి, సంజయ్‌క్రిష్ణ, పోతుగంటి సహదేవ్, కొమ్ము సుజాత, పవిత్ర, విద్యాసాగర్, అంజనాచౌదరి, రుక్సానాబేగం, తేజు, గణేష్, అంజిరెడ్డి, సుధాకర్, కావ్యారెడ్డి, సుహాసిని, సీనియర్ కోడైరెక్టర్ బాలరాజు, కమెడియన్ కర్తానందం ఉన్నారు.

పెళ్లైన 19 రోజులకే యువకుడు దుర్మరణం

- బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి
- కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఘటన


వెంకటేశ్ (ఫైల్)

కొండమల్లేపల్లి: పెళ్లైన 19 రోజులకే నవ వరుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్, అలివేలు దంపతుల ఏకైక కుమారుడు బొడ్డుపల్లి వెంకటేశ్(29) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 11న వెంకటేశ్‌కు గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత తిరిగి ఉద్యోగానికి వెళ్తున్న వెంకటేశ్ ఆదివారం సెలవు దినం కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. కాగా పెండ్లిపాకల గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు ఉండడంతో సెలవులు పెట్టేందుకు సోమవారం వెంకటేశ్ స్వగ్రామం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరి ఆఫీస్ పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి పయనయ్యాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొండమల్లేపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఈ ఘటన జరగడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. పెళ్లైన కొద్దిరోజులకే రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి

పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొడ్డుపల్లి వెంకటేశ్ బీజేపీలో కొనసాగుతూ పెండ్లిపాకల గ్రామంలో 135వ బూత్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. వెంకటేశ్ మరణ వార్త తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్‌కుమార్, లాలునాయక్, బొడిగ సాంబశివగౌడ్, పేర్ల జితేందర్, భరత్‌కుమార్, కుంభం యాదగిరి, పాక నగేష్, బోడ కృష్ణ, చిలువేరు శ్రీధర్, ఎండీ జహీర్, తారయ్య తదితరులున్నారు.